అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పురపాలన శాఖ ప్రాంతీయ సంచాలకులు జి.నాగరాజు మంగళవారం పరిశీలించారు. ముందు కార్యాలయంలో అభివృద్ధి పనులు, పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరా, సచివాలయాల పనితీరుపై సమీక్షించారు. అనంతరం వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా డ్రోన్ ద్వారా చేపడుతున్న సర్వేను పర్యవేక్షించి, త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా ఆదేశిస్తూ తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు మార్గదర్శకాలు జారీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ అధికారి బి. లింగేశ్వర రెడ్డి మంగళవారం ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేశారు. 18.11.2018కు ముందు జాయిన్ అయి 5ఏళ్లు పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, ఒకే చోట 8 ఏళ్లు సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తులను ఈనెల 24 నుంచి 26 తేదీ లోగా చేసుకోవాలని తెలిపారు. 25 నుంచి 27 తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో సీనియారిటీ జాబితా విడుదల చేస్తామని తెలిపారు. 30,31 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 1న అభ్యంతరాల పరిశీలన, జూన్ 2,3 తేదీల్లో ఫైనల్ జాబితా ప్రకటన చేస్తామని తెలిపారు. జూన్ 4 ఖాళీలు ప్రకటన ఉంటుందని తెలిపారు. బదిలీ అయ్యే వారికి వెబ్ ఆప్షన్స్ ప్రధానోపాధ్యాయులకు 5,6 తేదీల్లో, స్కూల్ అసిస్టెంట్‌లకు 5,6,7 తేదీల్లో, ఎస్‌జిటిలకు 5 నుంచి 8 తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. తరువాత బదిలీ అయిన ఉపాధ్యాయుల జాబితా ప్రకటన ఉంటుందని తెలిపారు. అనంతరం బదిలీ అయిన స్థానాలకు ఉపాధ్యాయులు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

10 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -శృంగవరపుకోట

పట్టణంలోని రైల్వే స్టేషన్ కు వెళ్లే రహదారిలో ఓ వ్యక్తి నుంచి 10 కేజీల గంజాయిని పట్టుకున్నామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ కి వెళ్లే రహదారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలానికి చెందిన వంతల ఆనందరావు అనే వ్యక్తి సుమానాస్పదంగా సంచరిస్తున్నాడు. దీంతో పోలీసులకు అందిన సమాచారం మేరకు అక్కడికి చేరుకొని అతని బ్యాగ్ పరిశీలించగా, అందులో. పది కేజీల గంజాయి ఉంది. ఈనేపథ్యంలో ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

టిడిపిలో ఆధిపత్య పోరు

వివాదంగా మారిన కిమిడి అసహనం

శతజయంతి ఉత్సవాల సాక్షిగా బట్టబయలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఇటీవల అశోక్ బంగ్లాలో జరిగిన ఎన్‌టిఆర్ శతజయంతోత్సవాల్లో మరోసారి బయటపడింది. చిలికిచిలికి గాలివానగా మారి పార్టీలో విభేదాలకు దారితీయడంతో సంఘటనపై పార్టీ హైకమాండ్ ఏకంగా ఆరాతీస్తున్నట్టు సమాచారం. నివేదిక సమర్పించాలని కూడా కోరినట్టుగా తెలుగు తమ్ముళ్లలో ప్రచారం జరుగుతోంది. ఎన్టీయార్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న జిల్లా పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసిన విషయం విధితమే. సభకు విజయనగరం పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఇందులో భాగంగా ఎచ్చెర్ల నియోజకవర్గం తరపున స్థానిక నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు సుమారు వందమంది కార్యకర్తలు, నాయకులతో హాజరయ్యారు. వేదికపైకి అతిథులను ఆహ్వానించిన పార్టీ నాయకులు కనకల మురళీమోహన్ ఎచ్చెర్ల నియోజకవర్గం తరపున కలిశెట్టిని ఆహ్వానించారు. దీంతో, అప్పటికే వేదికపై ఉన్న మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అతన్ని ఎలా? ఎందుకు పిలుస్తున్నారంటూ వేదికపై నుంచే తీవ్ర ఆగ్రహం వక్తం చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జునను కూడా ఇదేనా పద్ధతి అంటూ ప్రశ్నించారు. వేదికపై నుంచే అసహనంతో ఊగిపోవడంతో నాయకులంతా బిక్కబోయారు. దీంతో, కలిశెట్టి వేదికపైకి రాకుండా జనం మధ్యే ఉండిపోయారు. అనంతరం కొనసాగిన సభలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు మాట్లాడుతూ తలకు రంగురాసుకుంటే వయసు తగ్గినట్టు కాదు... పార్టీ పుట్టుక నుంచీ ఉన్నవారు కొత్తవారికి కూడా అవకాశాలు ఇవ్వాలి' అంటూ చమత్కరించారు. దీంతో, సభ చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటన పార్టీలో చర్చనీయాంశంగా మారింది. చివరకు పార్టీ ఇంటెలిజెన్సీ ద్వారా హైకమాండ్‌కు తెలియడంతో జరిగిన సన్నివేశంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు సమాచారం.

వాస్తవానికి కిమిడి కళావెంకటరావుకు, కలిశెట్టికి ఒకే నియోజకవర్గానికి చెందినవారు కావడంతో వారి మధ్య విభేదాలు ఉన్నాయి. కళా వెంకటరావు సీనియర్ నేత, గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా కూడా పనిచేశారు. కలిశెట్టి ఉత్తరాంధ్ర పార్టీ శిక్షణా కేంద్రం నడిపారు. ఈ క్రమంలో చంద్రబాబు, లోకేష్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇటు అశోక్ అనుచరుడుగా ఉన్నారు. నియోజకవర్గంలోనూ పార్టీ కార్యక్రమాలను చురుగానే నిర్వహిస్తున్నారు. దీన్ని కళా ఓర్వ లేకపోతున్నారని కలిశెట్టి అనుచరుల విమర్శ. కళాతో పోలిస్తే కలిశెట్టి స్థానం ఎంత? అన్నది కిమిడి అనుయాయుల వాదన. ఈ అంతర్గతపోరే నిండు సభలో కళావెంకటరావు అసహనానికి కారణమని పలువురు విశ్లేస్తున్నారు. దీన్ని అధిష్టానం ఎలా పరిష్కరిస్తుందో వేచిచూడాల్సిందే.

సర్వజన ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఇప్పటివరకు అందిస్తున్న సేవలపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ఘోషాసుపత్రి, జిల్లా సర్వజన ఆసుపత్రులను మంగళవారం ఉదయం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఘోషా ఆస్పత్రిలో అన్ని విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పేషెంట్లతో మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులతో సమావేశమై, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. వారి విజ్ఞప్తి మేరకు ఎసిలు, డెస్క్‌ట్యాప్‌లు, ప్రింటర్లు, స్కానర్లు, హిస్టోమేట్, సి-ట్యాప్, వెంటిలేటర్లు తదితర పరికరాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. జనరేటర్‌కు ఆటో స్విచ్ సౌకర్యాన్ని కల్పించాలని చెప్పారు. ఆధునీకరించిన ఆపరేషన్ థియేటర్‌ను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను ఆమె తనిఖీ చేశారు.అనంతరం వివిధ విభాగాధిపతులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. డాక్టర్ల విజ్ఞప్తి మేరకు కల్చర్ ల్యాబ్ మెటీరియల్, ఇతర విభాగాల నిపుణులు, ఐటిడిఎ నుంచి కో-ఆర్డినేటర్, థైరాయిడ్ టెస్టింగ్ కిట్స్, జనరేటర్, బయోమెట్రిక్ పరికరాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. జిల్లా కేంద్రాసుపత్రి కొత్తగా భోధనాసుపత్రిగా రూపాంతరం చెందడం వల్ల, మొదట్లో కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతాయని, వాటిని సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. ఎక్కడైనా సిబ్బంది వృథాగా ఉంటే వారిని ఇతర విభాగాలకు సర్దుబాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, వివిధ విభాగాల అధిపతులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

చిన్నారి తల్లికి చెక్కు అందజేస్తున్న జెసి మయూర్ అశోక్

చిన్నారి చికిత్సకు ప్రభుత్వ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందన మేరకు రేగిడి ఆముదాలవలస మండలం కందిశ గ్రామానికి చెందిన చిన్నారి పొనగంటి హేమలత చికిత్స నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన ఆర్థిక సాయాన్ని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అందజేశారు. ఇటీవల భోగాపురం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రిని చిన్నారి హేమలత తల్లిదండ్రులు కన్నబాబు, లక్ష్మీ లావణ్య కలిసి సమస్యను విన్నవించుకున్నారు. చిన్నారికి కంటి క్యాన్సర్ ఉందని సాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం జెసి మయూర్ అశోక్ తన ఛాంబర్లో చిన్నారి తల్లిదండ్రులకు రూ.1 లక్ష విలువ గల చెక్కును అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, రేగిడి తహశీల్దారు కళ్యాణ చక్రవర్తి, సామాజిక కార్యకర్త పి. సిద్దార్థ, తదితరులు పాల్గొన్నారు.

రైతు అవసరాలకు సంఘం దోహదం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రైతులందరికీ అవసరాలు, తీరాలంటే రైతు ఉత్పత్తిదారుల సంఘం ఒకటే దానికి దోహత పడుతుందని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి టి నాగార్జున అన్నారు. మండలంలోని తిమిడి రైతు భారత్ ఎఫ్‌పిఒను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాలకేంద్రం వద్ద జరిగిన ఈ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ రైతులందరి అవసరాలు ఆవేదనలు తీరాలంటే రైతు ఉత్పత్తి దారుల సంఘాలు ఒకటే దానికి ఏకైక మార్గమని ఒకరిగా చేయలేని పని సంఘంగా కలిపి చేయవచ్చునని అన్నారు. రైతు ఉత్పత్తిదార్ల సంఘం ఏర్పాటును నాబార్డు, భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ సబల సంస్థ ద్వారా చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వచ్చిన సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు, పాల ఉత్పత్తి దారుల సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

1న రాజాంలో ప్రచార జాతా

ప్రజాశక్తి-రాజాం

రాష్ట్రంలో 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో దాదాపు 40 వేల మందికి పైగా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బంది సిపిఎస్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు డిమాండ్ చేశారు. 010 ద్వారా జీతాలు చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, సంక్షేమ పథకాలు, సిపిఎస్ రద్దు తదితర డిమాండ్ల సాధనకై జూన్ 1 తేదీన రాజాం మున్సిపల్ ఆఫీసు వద్ద జరుగుతున్న ప్రచార జాతను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం కరపత్రం విడుదల చేశారు. కరోనా కష్టకాలంలో కోవిడ్ వారియర్స్ గా, ఫ్రంట్ లైన్ వారియర్స్ గా ప్రాణాలకు తెగించి మున్సిపల్‌కార్మికులు ప్రజలకు సేవ చేశారని అన్నారు. కార్యక్రమంలో పి. రాజేష్ యూనియన్ అధ్యక్షులు పి. గిరిబాబు కోశాధికారి ఎన్. చిన్నబాబు, కార్యదర్శి జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతకు సత్కారం

ప్రజాశకి-విజయనగరం టౌన్

రాష్ట్ర 6వ యూత్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించిన బుగత చంద్రశేఖర్(చంటి)ని వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇన్చార్జ్ అవనాపు విక్రమ్‌మంగళవారం సత్కరించి, అభినందించారు. ఇటీవల విశాఖ రైల్వేస్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ చాంఫియన్ షిప్ డిఆర్ఎం కప్ పోటీల్లో చంద్రశేఖర్ హెవీ వెయిట్ (86-92)లో పోటీపడ్డారు. రెండు బౌట్స్ లో విజయం సాధించాడు. ఒక బౌట్ లో ప్రత్యర్థిని నాకౌట్ చేయడం ద్వారా బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. జిల్లా కీర్తిని రాష్ట్రవ్యాప్తంగా చాటి చెప్పిన చంద్రశేఖర్ (చంటి)ని అవనాపు విక్రమ్ అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.ఉత్తమ శిక్షణను అందించిన బాక్సింగ్ కోచ్ ఈశ్వర్, బాక్సింగ్ అసోషియేషన్ రాష్ట్ర ప్రతినిధి డోల మన్మధకుమార్‌ను కూడా విక్రమ్ అభినందించారు.

మహిళల ఖాతాల్లో ఆసరా నిధులు

- 3వ విడత రూ.251.30 కోట్లు జమ
- డిజిటల్ ఎకనాలెడ్జ్‌మెంట్‌తో ధృవీకరణ

ప్రజాశక్తి-గుర్ల

మూడో విడత వైఎస్ఆర్ ఆసరా కింద రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.251.30 కోట్ల నిధులు జిల్లాలోని 36,463 మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి పూర్తిస్థాయిలో జమ అయ్యాయి. ఈ నిధులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా స్వయంశక్తి మహిళలు వ్యాపారాలు, ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టి తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకోవాలని జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. గుర్ల మండల కేంద్రంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యుల ఇళ్లకు వెళ్లి వారి వ్యక్తిగత ఖాతాలకు ఆసరా నిధులు జమ అయ్యిందీ లేనిదీ తెలుసుకొని డిజిటల్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌తో వారి ఇంటి నుంచే ధ్రువీకరించే కార్యక్రమాన్ని డిఆర్‌డిఎ అధికారులతో కలిసి చేపట్టారు. 3వ విడతలో గ్రామంలోని 62 సంఘాల్లోని 691 మంది సభ్యులకు కలసి రూ.47.42 లక్షలు జమ అయ్యిందని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి వివరించారు. మూడు విడతల్లో రూ.1.42 కోట్లు జమ అయ్యిందన్నారు. ప్రభుత్వం అందించిన సహాయాన్ని వినియోగించుకుని తమ స్వగ్రామంలోనే ఆదాయం పెంచే, ఉపాధినిచ్చే కార్యక్రమాలు నిర్వహించుకోవాలని జెడ్‌పి ఛైర్మన్ తెలిపారు. జిల్లాలో మూడు విడతల్లో ఆసరా కింద గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని 36,463 మహిళాసంఘాలకు చెందిన 3.93 లక్షల మంది సభ్యులకు రూ.754.13 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కె.వి.సూర్యనారాయణరావు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, సర్పంచ్ ఇజ్జిరోతు రమణమ్మ, ఎంపిటిసి సతివాడ శాంతమ్మ, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, ఎంపిడిఒ కళ్యాణి, డిఎల్‌డిఎ ఛైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, ఏరియా కోఆర్డినేటర్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళకు డిజిటల్ ఎకనాలెడ్జ్‌మెంట్ చూపిస్తున్నజెడ్‌పి ఛైర్మన్

సిఎస్ఆర్ నిధులతో మౌలిక వసతులు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని పారిశ్రామిక సంస్థలు తమ లాభాల నుంచి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఖర్చుచేసే నిధులతో జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. పరిశ్రమలు ఖర్చు చేసే సిఎస్ఆర్ నిధులను ఈ కార్యక్రమాలకే వినియోగించేలా ఆయా యాజమాన్యాలతో సంప్రదించాలని పరిశ్రమలతో సంబంధాలు నెరపే శాఖల్ని కలెక్టర్ ఆదేశించారు. ఆచా శాఖల అధికారులతో కలెక్టం మంగళవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటర్లు, హాస్టళ్లు, పాఠశాలల్లో మరుగుదొడ్లు ఇతర వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిశ్రమలు తమకు వచ్చే లాభాల నుంచి 2 శాతం నిధులను సిఎస్ఆర్ కింద వినియోగించాల్సి వుంటుందని, ఆ నిధులను సమీకరించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ చెప్పారు. పాఠశాలలు తెరిచే లోపే వసతులు కల్పించేలా ప్రతి వారం రోజులకు ఈ కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అదేవిధంగా బ్యాంకులు కూడా తమ సిఎస్ఆర్ నిధుల నుంచి ఈ కార్యక్రమాల కోసం నిధులు కేటాయించేలా చూపాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌కు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, సిపిఓ పి.బాలాజీ, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సుదర్శనం, పరిశ్రమల జిల్లా అధికారి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నిరాహారదీక్ష చేస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగుల రిలే దీక్ష

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నెల్లిమర్ల తాలూకా అధ్యక్షుడు పి. వీరన్న దొర అద్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఒక్క రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టింది. ఈ శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు, కోశాధికారి శంకర రావు, స్థానిక ఎంపిడిఒ గిరి బాల ప్రారంభించారు. సిపిఎస్‌ను రద్దుపర్చి ఒపిఎస్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 1వ తారీకన జీతం ఇచ్చేందుకు చట్టం చేయాలని, పిఆర్‌సి ఏరియర్ వెంటనే చెల్లించాలని, ముఖ్యంగా జూలై ఒకటి 23 నుండి కొత్త పిఆర్‌సి ఇంప్లిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌ను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌కి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పింఛనుదారులకు ఇవ్వవలసిన సరెండర్ లీవ్, టిఏ బిల్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. పోలీస్ డిపార్ట్మెంట్‌లో ఉన్న వారికి వీక్లీ హాలిడేస్ ఇవ్వాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను నిరుద్యోగ యువతకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిజిఇఎ రాష్ట్ర కార్యదర్శి, ఒపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు యుగంధర్, స్థానిక ఎన్‌టిజి ఆదినారాయణ, జిల్లా కోశాధికారి వైశంకర్ రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి, మల్లంపేట, గిరిజన కళాశాల బాలుర వసతి గృహం ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువల్లో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. పారిశుధ్య కార్మికుల పని విధానంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా చల్లని మజ్జిగ, చెరుకు రసం పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మంగళవారం కస్పా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగరంలోని రాజారావు మేడ సమీపంలో ఉచితంగా చెరుకు రసం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె.. స్వయంగా వాహన చోదకులకు, పాదచారులకు చెరుకు రసం పంపిణీ చేశారు. సంఘం తరపున భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సుమారు రూ.50 వేలు వెచ్చించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా ప్రజలకు చెరుకు రసం పంపిణీ చేస్తున్నామని సంఘం అధ్యక్షులు వెత్స శ్రీనివాసరావు, కార్యదర్శి ముత్యాల నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి కోలగట్ల కామేష్, పలివెల శ్రీనివాసరావు, కాపుగంటి రమేష్, ముత్యాల శ్రీనివాసరావు, అక్షింతల సతీష్, కాపుగంటి రామకష్ణ, గ్రంధి సూరి, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 47ను సవరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ బదిలీల కోసం ప్రభుత్వం జారీ చేసిన 47 జీవోను సవరించాలని ఎపిటిఎఫ్ (1938) డిమాండ్ చేసింది. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు మాట్లాడుతూ బదిలీలలో ఏ ఒక్క పోస్టును బ్లాక్ చేయకుండా అన్ని ఖాళీలు చూపించాలన్నారు. జీవో 117 వలన ఎఫెక్ట్ అయిన ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలన్నారు ఉపాధ్యాయులపై ఆధారపడిన భార్య, తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత కేటగిరి కేటాయించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు 50శాతం అనే నిబంధన కాకుండా అందర్నీ రిలీవ్ చేయాలన్నారు. పిజిటి ఉపాధ్యాయులకు అలవెన్స్ అని కాకుండా ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్.కృష్ణ, ఎన్‌విపైడిరాజు, ఎవి శ్రీనివాసరావు, వై.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం మదర్ తెరిసా క్లబ్‌లో రోడ్ సేఫ్టీ అధ్యక్షులు మజ్జి అప్పారావు జన్మదినం సందర్భంగా పిల్లలకు ఉడకబెట్టిన గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రభాకర్ రావు , 41వ వార్డు కార్పొరేటర్ సూర్యనారాయణ రావు , మాజీ కార్పొరేటర్ ముద్దాడ చంద్రశేఖర రావు, రోడ్ సేఫ్టీ సభ్యులు పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించి ఉడకబెట్టిన గుడ్లు అందించి సహకరించిన అప్పారావుకు తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్ అభినందనలు తెలిపారు.

ఇఎస్ఐ ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఇఎస్ఐ కార్మికుల ఆందోళన

మెరుగైన వైద్య సేవలందించాలని డిమాండ్

ప్రజాశక్తి-గరివిడి

ఇఎస్ఐ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు మందులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన వందలాది మంది కార్మికులు మంగళవారం ఇఎస్ఐ డిస్పెన్సరీ ఎదుట ఆందోళన చేపట్టారు. అంతకుముందు రైల్వేగేటు నుంచి ఇఎస్ఐ డిస్పెన్సరీ వరకు ర్యాలీ నిర్వహించారు. నాణ్యమైన వైద్యం అందించాలని, అసవరమైన మందులు ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం ఇఎస్ఐ డిస్పెన్సరీ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు టివి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గౌరినాయుడు మాట్లాడారు. ఆస్పత్రిలో నాలుగేళ్లగా టెక్నీషియన్ లేకపోవడతో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదన్నారు. ఆస్పత్రికి వెళ్తే చీపురుపల్లి సిహెచ్‌సి, గరివిడి పిహెచ్‌సికి లేదా విశాఖలోని మల్కాపురం ఇఎస్ఐ ఆస్పత్రికి పంపిచేస్తున్నారని అన్నారు. దీనివల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆస్పత్రిలో రిఫరల్‌కే పరిమితం తప్ప సేవలు అందడం లేదన్నారు. మరోవైపు కార్మికులకు సెలవులు ఇవ్వాలంటే సిబ్బందికి డబ్బులు ఇచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న 5వేల మంది కార్మికులకు తగ్గట్టు ఆస్పత్రిలో సిబ్బంది లేరని, వెంటనే సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో పరిష్కరించక పోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు పాపినాయుడు, రమణ, సన్యాసి నాయుడు, సాంబ, ఈశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించొద్దు

జామి: మండలంలోని టిడిపిలో వర్గ రాజకీయాలను నియోజకవర్గ ఇంఛార్జీలు ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదని మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, మాజీ జెడ్‌పిటిసి బండారు పెద్దబాబు, పార్టీ నాయకులు రెడ్డి పైడిబాబు, వేంద్రపు నాయుడు బాబు, మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకట త్రివేణి అన్నారు. మంగళవారం మాజీ జెడ్‌పిటిసి పెద్దబాబు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఇంఛార్జి వర్గ రాజకీయాలను ప్రోత్సహించడం వల్ల పార్టీ కార్యకర్తలు అభిమానుల్లో గందరగోళం నెలకొందన్నారు. నియోజకవర్గంలో పార్టీ నాయకత్వం ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఇప్పటికైనా టిడిపి పార్టీకి నష్టం కలిగించే పనులు మానుకోవాలని హితవు పలికారు.

మహిళల ఖాతాల్లో ఆసరా డబ్బులు

డెంకాడ: మహిళల ఖాతాల్లో ఆసరా డబ్బులు జమవుతున్నాయని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు అన్నారు. ఆయన ఛాంబర్‌లో మంగళవారం ఆసరా స్టిక్కర్లను ఆయన విడుదల చేశారు. మహిళల వ్యక్తి గత ఖాతాల్లో నగదు వేస్తున్నట్లు వెల్లడించారు. పినతాడివాడలో ఈ స్టిక్కర్లను సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపిటిసి విసినిగిరి అచ్చింనాయుడు, మండల కేంద్రంలో ఎఎంసి చైర్మన్ రొంగలి కనకసింహాచలం విడుదల చేశారు. ఈ కారయక్రమంలో డెంకాడ సర్పంచ్ పతివాడ గౌరి, ఉప సర్పంచ్ ఆదినారాయణ, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో వైఎస్ఆర్ ఆసరా నిధులు మహిళలు ఖాతాల్లో జమవుతున్నాయని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు తెలిపారు. 11,978 మంది సభ్యులకు గాను రూ. 6.63 కోట్లు జమయ్యాయన్నారు. అనంతరం ఆసరా స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎస్ అప్పలనాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, జిల్లా పంచాయతీ రాజ్ వింగ్ చైర్మన్ ఎం సత్యనారాయణ, ఎంపిటిసి గాడి గంగ తల్లి, ఎపిఎం రొంగలి శ్రీనివాస రావు, వెలుగు సిసి కృష్ణ పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్చాలి

రేగిడి : గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్చాలని ఎంఇఒ ఎం. వరప్రసాదరావు సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం సిఆర్‌పిలు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న నవరత్నాలలో భాగంగా అమ్మఒడి పిల్లలందరకు ఇకపైనె చేయించేలా కృషి చేయాలన్నారు. మనబడి, నాడు- నేడు పనులను త్వరితగతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఇఒ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎంఆర్‌సి సూర్యారావు, సిఆర్‌పిలు వెంకటరమణ, చంద్రరావు, కృష్ణ, మోహనరావు, ఎంఆర్‌సి సిబ్బంది అప్పలనాయుడు, శంకర్రావు పాల్గొన్నారు.

గురుదేవ్ ఆసుపత్రికి అంబులెన్స్ బహూకరణ

అంబులెన్స్‌ను అందిస్తున్న ప్రతినిధులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం వద్ద గల గురుదేవ్ ఆసుపత్రికి, శారద మెటల్స్ అండ్ అలోయిస్ లిమిటెడ్ కంపెనీ అంబులెన్స్‌ను బహూకరించింది. మంగళ వారం శారద కంపెనీ హెచ్‌ఆర్ డిజిఎం హెచ్ సన్యాసిరావు అంబులెన్స్‌ను శ్రీ గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్‌కు అందించారు. గురుదేవ్ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జి.శంకర రావు, ప్రతినిధి కె. సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనికి అవకాశం కల్పించండి

పూసపాటిరేగ: ఉపాధి హామీ పథకం పని చేసుకోవడానికి అవకాశం కల్పించాలని మండలంలోని వెల్లూరు గ్రామానికి చెందిన అవసాక గంగయ్య సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఎంపిడిఒ రామారావుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గ్రామంలో కూలి పనులు చేసు కొని తన కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపారు. గ్రామంలో తనను గ్రీన్ అంబాసిడర్‌గా నియమించారన్నారు. అయితే 7 నెలలు నుండి వేతనం చెల్లించలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పనికి వెళితే తనను రానివ్వడం లేదని వాపోయారు. గ్రీన్ అంబాసిడర్ పనికి వేతనం ఇవ్వక, ఉపాధి హామీ పనికి రానివ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నానన్నారు. ఉపాధి పని చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరాడు. ఆయనతో పాటు సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

గ్రామ సమస్యలపై ఐక్యంగా పనిచేయాలి

భోగాపురం: గ్రామ సమస్యలపై అంతా ఐక్యంగా పనిచేయాలని సర్పంచ్ కర్రోతు వెంకటరమణ అన్నారు. మండలంలోని పోలిపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం సర్పంచ్ కర్రోతు వెంకటరమణ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో సమస్యలపై చర్చించి పరిష్కారానికి సభ్యులతో చర్చించారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. పంచాయతీ ఖర్చులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి వి. రమణమ్మ, మాజీ ఉప సర్పంచ్ పతివాడ రామకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలి

భోగాపురం: అంగన్వాడీలు సక్రమంగా పనిచేసి చిన్నారులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్య కూడా నేర్పించాలని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, గ్రామ సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి అన్నారు. అమటాం రావివలస పంచాయితీ దల్లిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందని, విద్యకు పెద్ద పీట వేస్తుందని అన్నారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు రేషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శాంతిలత, పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, మహిళా పోలీసు రీనా పాల్, వార్డు మెంబరు దల్లి లక్ష్మి, గ్రామ పెద్దలు దల్లి సూరి, దల్లి నరసింగరావు, బోర నాగరాజు, దల్లి సోమిరెడ్డి, దల్లి బంగారి, బోర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న జిల్లాపరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఉత్తమ విద్యార్థులకు ఘన సత్కారం

మెరక ముడిదాం : పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి అత్యధిక మార్కులు సాధించిన 23 మంది విద్యార్థులను జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం సత్కరించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వమించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి పాఠశాలలకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చారన్నారు. దీనింతటికీ పాఠశాలలను ప్రభుత్వం సమూలంగా మార్పుచేయడమే కారణమన్నారు. మున్ముందు ఇంత కంటే మెరుగైన ఫలితాలు ప్రభుత్వ పాఠశాలలు సాధించాలని కోరారు. ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణ రాజు, వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల వెంకటరావు, వైస్ ఎంపిపి కందుల పార్వతి, పప్పల కృష్ణమూర్తి, గ్రహణేశ్వరరావు, తాడ్డి చంద్ర శేఖర్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఎంఇఒ పి. రామారావు, ఎంపిడిఒ పి. రామకృష్ణ పాల్గొన్నారు.

తెలుగు సాహితీరంగానికి లోటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆచార్య కేతువిశ్వనాథ రెడ్డి మృతి తెలుగు సాహితీ రంగానికి తీరని లోటు అని ప్రముఖ రచయిత, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. అక్షర సంపన్నుడు, నిరాడంబరుడైన కేతు విశ్వనాథ రెడ్డి తెలుగుజాతి గర్వించదగ్గ రచయిత అని , అభ్యుదయ రచనలకు చిరునామాగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. 2012 జూలై 1న విజయనగరం ఉపాధ్యాయ భవనంలో హైదరాబాద్‌కు చెందిన కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ప్రధాన కార్యదర్శి మద్దాళి రఘురామ్ ఆధ్వర్యంలో కొవ్వలి లక్ష్మీనరసింహారావు శతజయంతి ఉత్సవాలలో విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారని గుర్తు చేశారు. నేపథ్యంలో 'వెయ్యినవలల కొవ్వలి' అనే పేరుతో తాను రాసిన పుస్తకాన్ని కేతు విశ్వనాథరెడ్డి ఆవిష్కరించారని తెలిపారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై టిడిపి నిరసన

ప్రజాశకి- నెల్లిమర్ల

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు డిమాండ్ చేశారు. థామస్‌పేటలో సబ్ స్టేషన్ వద్ద మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడు సార్లు విద్యుత్తు ఛార్జీలను పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, బైరెడ్డి లీలావతి, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, మాజీ సర్పంచులు చింతపల్లి సత్యనారాయణ, గురాన అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోట: మోకాళ్ల మీద బైఠాయించి నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

డెంకాడ: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి నాయకులు విద్యుత్తు ఛార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, నాయకులు కాగితాల సత్యనారాయణ రెడ్డి, పడాల చిన్నారావు, కొయనేని రమణ, కలిదిండి రంగరాజు, చలుమూరి మహేశ్, ఆదిబాబు, ముని పైడయ్య, సబ్బవరపు పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కిమిడి నాగార్జున ఆదేశాలు మేరకు టిడిపి మండల అధ్యక్షులు చనమల మహేశ్వరరావు ఆధ్వర్యంలో గుర్ల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యుత్ ఛార్జీలను సర్దుబాటు పేరుతో పెంచుకుంటూ పోతున్నారన్నారు. దీనికి తోడు విద్యుత్తు కోతలు కూడా అధికమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పిల్ల అప్పలనాయుడు, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు, నాయకులు మండల అప్పలనాయుడు, బెల్లాన సత్యనారాయణ, కనిమెరక కృష్ణ, కె పైడినాయుడు పాల్గొన్నారు.

గజపతినగరం: విద్యుత్తు ఛార్జీలు పెంపును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే కె.ఎ నాయుడు ఆధ్వర్యంలో గజపతినగరం సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మంనాయుడు, మాజీ సర్పంచులు గుంట్రోతు గోవిందు, లెంక బంగారు నాయుడు, వివి ప్రదీప్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: విద్యుత్ ఛార్జీలు పెంపునకు నిరసనగా మండలంలోని కొప్పెర్ల సబ్ స్టేషన్ వద్ద మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మహంతి శంకర్రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు డంగా భూలోక, మైలపల్లి సింహాచలం, జిల్లా నాయకులు ఆకిరి ప్రసాదరావు, పిన్నింటి సన్యాసినాయుడు, బొంతు రవి, ముత్యాల వెంకటరమణ, చందక ఆనందరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పెరిగిన విద్యుత్తు ఛార్జీలకు నిరసనగా మండలంలోని పోతనాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నియోజకవర్గ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో రోడ్డు మీద మోకాళ్లపై బైఠాయించి మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, నాయకులు నానిగిరి రమణాజీ, గొర్లె కన్నతల్లి, బీశెట్టి అరుణ, కె.మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు, ఇందుకూరి శ్రీను రాజు, చెక్కా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

భోగాపురం: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు పిలుపులో భాగంగా భోగాపురం మండల టిడిపి అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి జాతీయ రహదారి సర్వీస్ రోడ్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. సబ్ స్టేషన్‌లో జెఇకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అప్పలస్వామి, పిడుగు వెంకటసత్యం, లెంక రామనర్సి, గరే వెంకటరమణ, బొడ్డ హరిబాబు, రామకృష్ణ, యువ నాయకులు, రామారావు, లోకేష్, సోమిరెడ్డి, వర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), మండల ప్రధాన కార్యదర్శి కనకాల శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు మాస్టర్, నాయకులు ఎల్లపు సూరిబాబు, బంగారు రమేష్, కొరుపోలు అప్పారావు, కర్రి చంద్రశేఖర్ (చిన్నా), విరోతి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

చెరకు దిగుబడులపై మెలకువలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో రేగిడి, వంగర మండలాల చెరకు రైతులకు దిగుబడి మెలకువలపై మంగళవారం అవగాహన కల్పించారు. కర్మాగార కేన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్ కుమార్ రెడ్డి, కేన్ సీనియర్ మేనేజర్ కిల్లి అప్పారావు మాట్లాడుతూ రైతులు చెరకు పంటలో సాళ్ల మధ్య దూరం తక్కువగా ఉంచుతున్నారని ఆ విధంగా పంటలు పండిస్తే దిగుబడులు సాధ్యం కాదని అన్నారు. చెరకు పంటలో 9 రకాల మెలకువలు అధనం గా పాటించాలన్నారు. సాళ్ల మధ్య దూరం పద్ధతిలో అలవాటు చేసుకోవాలన్నారు. వీటి మధ్య దూరం 4.5 అడుగులు అంతకంటే ఎక్కువ దూరం ఉండాలన్నారు. సేంద్రియ ఎరువులు, సేంద్రియ కర్బనం భూమికి చేర్చాలన్నారు. సూక్ష్మధాతు మూలకాలను భూమికి అందించాలని వెల్లడించారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో భూమి సారవంతమై దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. మమ్ము తోటలో చెరకు చెత్త కప్పుట, చెత్త కొట్టు, ఎల్లి పరిస్థితుల్లోనూ చెత్తను కాల్చరాదని వెల్లడించారు. మమ్ము తోటలలో ఖాళీలను నింపాలని అందుకు వాడిన విత్తనాలనే వాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 158 మంది రైతులకు ఇఐడి పారి షుగర్స్ యాజమాన్యం బోకేలు నిచ్చి దుస్సాల వాళ్ళతో ఘనంగా సన్మానించారు.

నవధాన్యాల సాగు నేల తల్లికి బాగు

వేపాడ: మండలంలోని కరకవలస గ్రామ యూనిట్లో సుస్థిర వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రైతులకు నవధాన్యాల తయారీ కిట్లు పంపిణీ చేశారు. నవధాన్యాలను నేలలో కలిపి దున్నడం వల్ల సారవంతం పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ విధానంతో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. పప్పు జాతులు, చిరుధాన్యాలు, ఆకుకూరలు సుగంధ ద్రవ్యాలు కలుపుకొని నవధాన్యాలను తయారు చేసుకోవాలన్నారు. అనంతరం జగ్గయ్యపేట, గుడివాడ, సోంపురం గ్రామాలకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఏ రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో నేల సారవంతం

గజపతినగరం: పచ్చిరొట్ట విత్తనాలతో సాగు చేయడం వల్ల నేల సారవంతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి సి.హెచ్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని గంగ చోళ్ల పెంట గ్రామంలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలను రాయితీపై ఇస్తున్నామన్నారు. పది కేజీలు రూ. 395, కట్టె జనుము పది కేజీలు రూ.420, పిల్లి పెసర 8 కేజీలు రూ. 388కి అందిస్తున్నామన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి సాగు చేసే రైతులు పచ్చిరొట్ట సాగు చేసి నేలలో కలియదున్నడం వల్ల సూక్ష్మ జీవులు పెరిగి జీవ రసాయనిక చర్యలు జరిగి సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందన్నారు. దీని ద్వారా నేలలో చాలా రకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా ఎరువుల వినియోగం తగ్గించి ఖర్చును తగ్గించవచ్చని, పచ్చిరొట్ట పైర్లు నేలలో కలియదున్నడం వల్ల భూమి లోపల ఉన్న పోషకాలు ఉపరితలానికి తీసుకురాబడి మొక్కలకు అందుబాటులోకి వస్తాయని కలుపు మొక్కలు పెరగకుండా కూడా కాపాడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎ.ఒ లోకేష్, వి.ఎ.ఎ కరిష్మ, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో టాప్

ప్రజాశక్తి- మెరక ముడిదాం

పేద వాడికి సొంతింటి కల నెర వేర్చడంలో మెరక ముడిదాం మండలానికి 1926 ఇళ్లను మంజూరు చేయగా ఇప్పటికే 1332 ఇల్లు పూర్తిగా నిర్మించడంలో మండలం ముందుండడం చాలా సంతోషధాయాకమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పని తీరును సమీక్షిస్తుండగా హౌసింగ్ గురించి మండల అధికారి తెలియ చేయగా, జెడ్ పి చైర్మన్ మాట్లాడుతూ మండలంలో అర్హత కలిగిన ఏ ఒక్క వ్యక్తి ప్రభుత్వం ఇచ్చిన ఇల్లును కోల్పోకూడదన్నారు. మండలంలో ఫేజ్ త్రీ నాడు -నేడు పనులు గురించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి వివరిస్తుండగా ఏఏ పాఠశాలల్లో ఫేజ్ త్రీ పనులు గుర్తించావ్, ఆ పాఠశాలలను సందర్శించావా లేదా? అని అడగగా ఆమె నుండి సమాధానం రాకపోవటంతో, అసంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పలు శాఖలపై సమీక్షించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు?

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సమస్యలు పరిష్కారం కానీ సమావేశాలు ఎందుకని మండలంలోని పలువురు గ్రామ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని ధర్మవరం, చామలాపల్లి, పోతనపల్లి, కృష్ణాపురం తదితర గ్రామాల సర్పంచులు సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ అధికారులు సర్పంచులకు విలువనీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ సచివాలయాలలో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని అన్నారు. ముఖ్యంగా సచివాలయ సర్వేర్లు ఎవరికి ఫోన్ చేసినా జగనన్న సమగ్ర భూ సర్వేలో ఉన్నామంటూ సంవత్సరం పాటుగా సచివాలయంలో కనిపించడం లేదని అన్నారు. 104 వాహనం ఏ రోజు ఏ గ్రామానికి వెళ్తుందో తెలియకపోవటం వల్ల ఒపి తక్కువగా ఉంటుందని 104 వాహనం వచ్చే సమాచారం ముందుగా తెలియజేస్తే గ్రామాలలో టామ్ టామ్ వేయిస్తామని ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య అన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలను తరువాత సమావేశంలో కూడా చర్చించుకోవడం దారుణమని, జగనన్న హౌసింగ్ స్కీములో కట్టిన ఇళ్లకు బిల్లులు ఇవ్వకుండా 15 ఏళ్ల క్రితం కట్టిన ఇంటికి రూ.30 వేలు లంచం తీసుకుని హౌసింగ్ అధికారులు బిల్లులు చేశారని చామలాపల్లి సర్పంచ్ సూర్యారావు ఆరోపించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పిన్నింటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో వాలంటీర్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో వాలంటీర్ల పాత్ర కీలకమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని కంటకాపల్లి గ్రామ సచివాలయంలో పంచాయితీ కార్యదర్శి మాధవీలత అధ్యక్షతన మంగళవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ మాట్లాడుతూ, వాలంటీర్ల వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిస్తోందన్నారు. అనంతరం, ఉత్తమ సేవలందించి సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డు పొందిన గ్రామ వాలంటీర్లకు సాలువాలతో సత్కరించి, సర్టిఫికేట్లు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో కంటకాపల్లి, కాటకాపల్లి, చినరావుపల్లి సర్పంచులు మదీన లక్ష్మి, పీతల కృష్ణ, బూసాల దేముడు, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ డైరక్టర్ పి.ఎస్.ఎన్.పాత్రుడు, కంటకాపల్లి నాయకులు మదీన అప్పలరమణ, ఎంపిడిఒ పద్మజ, వాలంటీర్లు, పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజల చెంతకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న వాలంటీర్లే సంక్షేమ సారథులని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం కళాభారతి ఆడిటోరియంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కులమత రాజకీయాలకు అతీతంగా 98.5శాతం హామీలను నెరవేర్చారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధుల్లా పనిచేస్తున్న వాలంటీర్లు నిష్పక్షపాతంగా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించి జగన్మోహన్ రెడ్డి వెన్నుదన్నుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, గోపాలరావు, టౌన్ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


రేగిడి: మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్

గజపతినగరం: మండలంలోని ఎనిమిది సచివాలయాలలో సేవలందిస్తున్న వాలంటీర్లుకు ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, జెడ్‌పిటిసి గార.తౌడు సేవారత్న, సేవామిత్ర అవార్డుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారుదులు అని అన్నారు. గజపతినగరం-2 సచివాలయం వాలంటీర్ ఆర్.దుర్గాప్రసాద్‌కి సేవారత్న, 126 మందికి సేవామిత్ర అవార్డుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, వైస్ సర్పంచ్ కర్రీ రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, ఎంపిడిఒ పప్పు సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: వాలంటీర్ల వ్యవస్థ మన రాష్ట్రంలోనే నడుస్తుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మేజర్ పంచాయితీలో గల 1, 4, 5 గ్రామ సచివాలయాలకు చెందిన వాలంటీర్ల సేవలకు పురస్కారాల ప్రధానోత్సవం సచివాలయ స్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ వాలంటీర్లును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రేగిడి : రాష్ట్రంలో వాలంటీర్లు సేవలు దేశానికి ఆదర్శమని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్, ఉణుకూరు సర్పంచ్ గేదెల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం సచివాలయంలో గ్రామ వార్డు వాలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథ రావు, నాయకులు, పంచాయతీ కార్యదర్శి జ్యోతిర్మయి, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని కొండ గుంపాం సచివాలయంలో 21 మంది వాలంటరీలకు వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ సేవ పుష్కరాలను మంగళవారం అందించారు. ఈ కారక్రమంలో సర్పంచ్ పతివాడ అప్పన్న, గరికిపేట మాజీ సర్పంచ్ రాజిబాబు పంచాయతీ మెంబర్లు కన్వీనర్లు గ్రామ పెద్దలు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని గుడివాడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను మంగళవారం అందించారు. వేవపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఏ ధరణి ఆధ్వర్యంలో 88 మందికి వైద్య పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశావరు. 64 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణంరాజు, ఎంపిడిఒ పట్నాయక్, సిహెచ్‌ఒ ఆంజనేయులు, పిహెచ్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణవేణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ సెంటర్ పరిశీలన

మండలంలోని రామస్వామి పేట గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజిషియన్ సెంటర్‌ను ఎంపిడిఒ బిఎస్‌కేఎన్ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజు పరిశీలించారు. సెంటర్ నిర్వహిస్తున్న సంబంధిత రికార్డులను పరిశీలించారు.

నాడు-నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్ పురం ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు నేడు పనులను ఎంపిడిఒ బిఎస్‌కేఎన్ పట్నాయక్, ఎంఇఒ జి శ్రీదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, చేపడుతున్న పనులు నాణ్యత లోపం లేకుండా చేయాలని అన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్.కోట సభలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా పట్టణంలోని శ్రీనివాసా థియేటర్ నుండి పార్టీ శ్రేణులు ర్యాలీ ప్రారంభించి చంద్రబాబుకు వ్యతిరేక నినాదాలతో దేవిగుడి జంక్షన్ వరకు వచ్చి, మానవహారం నిర్వహించి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మ దగ్ధం చేసారు. అనంతరం ఎస్.కోటలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభ నిర్వహించిన ప్రదేశాన్ని పసుపునీటితో శుద్ధి చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బి.సి కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పి.వెంకటరమణ, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి పాల్గొన్నారు.



ఎల్‌కోట : నిరసన ర్యాలీ చేస్తున్న వైసిపి నాయకులు

లక్కవరపుకోట: ఇటీవల శృంగవరపుకోటలో నిర్వహించిన సభలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీఎం జగన్మోహన్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎంపిపి గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైసిపి నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి మండల కూడలిలో గల సాయిబాబా జంక్షన్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. తొలిత మానవహారం నిర్వహించి చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రవాణా, హమాలీ ఛార్జీలు చెల్లించాలి

బొబ్బిలి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇచ్చిన రైతులకు రవాణా, హమాలీ ఛార్జీలు చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులు సొంతంగా రవాణా, హమాలీ ఛార్జీలు భరించి ధాన్యం తరలిస్తే రైతులకు ప్రభుత్వం నేరుగా ఆయా ఛార్జీలను చెల్లిస్తుందని ప్రకటించినా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. రైతులకు చెల్లించాల్సిన రవాణా, హమాలీల ఛార్జీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే అధికార పార్టీకి చెందిన నేతలు రైతులకు చెల్లించకుండా మింగేసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు

బియ్యం అమ్మకం నేరం

శృంగవరపుకోట: ప్రభుత్వ బియ్యం అక్రమ నిల్వ, అమ్మకం, కొనుగోలు నేరమేనని తహశీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో పిడిఎస్ బియ్యపై మంగళవారం అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడిఎస్ బియ్యం అమ్మడం, కొనడం రెండూ నేరమేనని, నేరం రుజువైతే రైస్ కార్డ్ రద్దు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చీమలమందు తాగి వృద్ధురాలు మృతి

లక్కవరపుకోట: మండలంలోని గంగుబూడి గ్రామపంచాయతీ శివారు గజపతినగరం గ్రామంలో నివాసముంటున్న కర్రి వరహాలమ్మ (70) చీమల మందుతో దోసె వేసుకుని తినడంతో మంగళవారం మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరహాలమ్మ ఈనెల 18న గోధుమపిండి, చీమలమందు పక్క పక్కన ఉండడంతో పొరపాటున బెల్లంతో చీమల మందు కలుపుకొని దోసె కాల్చి తినడంతో అస్వస్థకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు కర్రీ అప్పలపాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ ఎం ముకుందరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని లక్కడాం గ్రామానికి చెందిన కిలపర్తి రామకృష్ణ (33) కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గంట్యాడ ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాలు ప్రకారం మృతుడు తన ఇంట్లో మోటారు చెడు పోవడంతో బాగు చేస్తానని వెళ్లి మోటార్ ను పట్టుకోవడంతో కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు 108 వాహనంలో విజయనగరం తిరుమల హాస్పిటల్‌కు తీసుకొని వెళ్ళగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు విశాఖపట్నం ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ తన స్వగ్రామంలో జరుగుతున్న పండుగకు వచ్చి ఇలా మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకు న్నాయి. మృతుడుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి నారం నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

20 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

బొబ్బిలి: మండల పరిధిలో అలజంగి గ్రామానికి చెందిన వేటూరి తిరుపతి రావు మద్యం సీసాలు అమ్ముతుండగా 20 మద్యం సీసాలతో పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించామని ఎస్ఇబి సిఐ జైభీమ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ఎవరైనా అక్రమంగా మద్యం సీసాలు, నాటుసారాలు విక్రయిస్తే 9440902372కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది మాధవి దేవి, చంద్ర ప్రసాద్, ఆదినారాయణలు పాల్గొన్నారు.